## మాత రామాబాయికి ఘన నివాళి



**కందుకూరు జనసాక్షి:** బాబా సాహెబ్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి 128వ జయంతి వేడుకలు శనివారం బీటీఏ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మాత రమాబాయి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు బీరకాయల మాధవరావు పూల మాల అలంకరణ చేయగా బీటీఏ నాయకులు నివాళిలలర్పించారు. బీటీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కల్లగుంట మోహనరావు మాట్లాడుతూ మాత రమాబాయి కడు పేదరికం అనుభవిస్తూ తన నలుగురు బిడ్డలు చని పోయిన వెనకడుగు వేయకుండా అంబేద్కర్ చదువుకు పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచి బహుజన ప్రజలందరి మాతగా నిలిచిందని కొనియాడారు. ఈ సందర్భంగా మాత రమాబాయిని ప్రతి తల్లి స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు చలంచర్ల పెద్దబ్రహ్మయ్య, కట్టా రమేష్, షేక్. అబ్దుల్లా, మందూరి రమణయ్య, గుడిపూడి అంజయ్య , కేవై కోటయ్య, కొప్పోలు శ్రీనివాసరావు, భగత్ సింగ్ పాల్గొని నివాళిలర్పించారు.

## ఘనంగా అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలు



**టంగుటూరు జనసాక్షి:** టంగుటూరు అంబేద్కర్ పార్క్‌లో డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి 128 జయంతి కార్యక్రమం అంబేద్కర్ యూత్ అసోసియేషన్ నాయకులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అశోక్ బాబు మాట్లాడుతూ రమాబాయి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చదువుకోవటం కోసం పిడకలు అమ్మి , తినీకుండా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని, చివరకు తన నలుగురు బిడ్డలు చనిపోతున్న ఆ డబ్బులతో బిడ్డలను బతికించు కాకుండా, అంబేద్కర్ చదువుకుంటే ఈ దేశంలోని దళిత బిడ్డలందరు బ్రతుకుతారని తన బిడ్డల్ని త్యాగం చేసి అంబేద్కర్‌కి డబ్బులు పంపినటువంటి త్యాగశీలి రమాబాయి అని కొనియాడారు, రామబాయి లేకపోతే ఇంత చదువు చదివి, ఇంత ఆత్మస్థైర్యంతో ఈ దేశ రాజ్యాంగ నిర్మించలేనని ఎన్నోసార్లు బాధపడ్డారని అశోకబాబు తెలిపారు, ఈ కార్యక్రమంలో దుగ్గిరాల పేరరాజు మాట్లాడుతూ రమాబాయిని ఆదర్శంగా తీసుకొని అందరూ చదువుకోవాలని తెలిపారు, కార్యక్రమంలో తులిబిల్లి క్రాంతికుమార్, కసుకుర్తి రాజు, కస్కుర్తి భార్గవ్‌బడ, చల్లపల్లికుమార్, మేడిదిబాలకోటయ్య, నత్తల మాల కొండయ్య, మద్దిరాల బాలసుందరం, యరమాల కృష్ణ, దేవరపల్లి రాము, దుగ్గిరాలరాము, మద్దిరాలసుమన్, మేడిది వెంకట్రావు, యువకులు పెద్దలు పాల్గొని రమాబాయికి నివాళులర్పించారు.

## క్యాన్సర్ వ్యాధిని నిర్మూలిద్దాం



**కావలి జనసాక్షి:** ప్రజలు క్యాన్సర్ భారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుందామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సేవియర్స్ వాలెంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు శనివారం ఆయన కార్యాలయంలో కలిసి 3కె వాక్ క్యాన్సర్ అవగాహన ర్యాలీ పత్రికను అందజేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి ట్రంకు రోడ్డు మీదుగా విట్స్ కళాశాల వరకు ఆదివారం ఈ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు పరీక్షల ప్రాధాన్యతను కల్పించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలు కలకాలం ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులపై అవగాహన పెంచేందు ప్రజల భాగస్వామ్యం అవసరమనికోరారు. ఇటువంటి బృహత్తరమైన కార్యక్రమాలలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సిద్దు, ఆర్గనైజేషన్ నిర్వాహకులు వివిధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం తరువాత తొలిసారి పాలుట్ల తండాల్లో సోలార్ వెలుగులు





**ఒంగోలు జనసాకి:** ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని పాలుట్ల గిరిజన తండాలు జనావాసాల నుంచి సుమారు 60 కిమీ దూరంలో ఉంటాయి. అక్కడి గిరిజనులను చేరుకోవాలంటే నల్లమల్ల అడవుల్లో 3 గంటలు ప్రయాణం చేయాల్సిందే. దశాబ్దాల తరబడి వారు కనీసం సాంప్రదాయ విద్యుత్‌కు కూడా నోచుకోలేదు. అక్కడక్కడా కనిపించే సోలార్ విద్యుత్ వెలుగులతో.. అరకొర వసతులతో అక్కడి ప్రజలు జీవనం గడిపేవారు. ఆ గిరిజన తండాల్లో వెలుగులు నింపాలనే ఓ వ్యక్తి తాపత్రయం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను కదిలించింది. గతంలో యర్రగొండపాలె నియోజకవర్గం పర్యటనకు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ఆ వ్యక్తి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి గొట్టిపాటి...గిరిజనుల విద్యుత్ లేమి విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మంచి పనులను ప్రోత్సహించడంలో ముందుండే సీఎం... ఆఫ్ గ్రిడ్ సోలార్ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనితో పాలుట్ల గిరిజన తండాల్లోని సుమారు 611 కుటుంబాలలో సోలార్ వెలుగులు నింపాయి. సుమారు రూ 2.86 కోట్ల వ్యయంతో ప్రతీ ఇంటికి ఒక ఫ్యాను, 5 ఎల్ఈడీ లైట్లు, మొబైల్ ఫోన్ చార్జింగ్ సాకెట్‌ను మంత్రి గొట్టిపాటి తండా వాసులకు శుక్రవారం రాత్రి అందజేశారు.

**మూడు గంటల ప్రయాణించి.... ఆతిథ్యాన్ని స్వీకరించి...** రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఉన్న ఆరు గిరిజన తండా గ్రామాలను చేరుకోవడానికి మంత్రి గొట్టిపాటి, ఆయన బృందం మూడు గంటలు ప్రయాణించారు. అక్కడి చేరుకున్న మంత్రి బృందానికి గిరిజనులు వారి సంస్కృతీ, సంప్ర దాయ నృత్యాలతో స్వాగతం పలికారు. సోలార్ బ్యాటరీ స్టోరేజ్ వసతి కల్పించిన పలు ఇళ్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సందర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయంతో పాటు వారి పిల్లల చదువులు, జీవన విధానం గురించి వారి మాటల్లోనే విన్నారు. గిరిజనులతో మమేకమై వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎన్నికల సమయంలో మినహా కనీసం తండాల వైపు ఎవరూ చూడని పరిస్థితుల్లో మంత్రి గొట్టిపాటి చర్యలకు చెంచు గూడేలకు చెందిన గిరిజనులందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గిరిజనులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

**ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా....** ఆఫ్ గ్రిడ్ సోలార్ గృహ విద్యుద్దీకరణ పథకం ప్రారంభించి ఫ్యాన్లు, లైట్లు, మెబైల్ చార్జింగ్ సాకెట్ ను లబ్ధిదారులకు అందజేసిన అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఇందులో భాగంగానే పాలుట్ల తండాలలోని 611 కుటుంబాలకు సోలార్ బ్యాటరీ స్టోరేజ్ సౌకర్యం కల్పించామని అన్నారు. రాత్రి అయితే చీకట్లు నిండే ఈ గిరిజన తండాల్లో కూటమి ప్రభుత్వం వెలుగు నింపిందన్నారు. పాలుట్లకు వచ్చే సమయంలో రోడ్డు బాగా లేదని తమకు ప్రయాణానికి మూడు గంటలు పట్టిందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఈ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఉండటంతో రోడ్డు వేయడానికి ఉన్న అవకాశాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న కొందరు రైతులు బావుల నుంచి డీజిల్ ఇంజన్ల ద్వారా పొలాలకు నీటి సరఫరా చేసుకుంటుండటంతో ఎక్కువ ఖర్చు అవుతోందని, అలాంటి వారికి సోలార్ ద్వారానే మోటార్లు పని చేసేలా ఉండే అవకాశాలని పరిశీలించాలని మంత్రి గొట్టిపాటికి విజ్ఞప్తి చేశారు. తండాల్లో వీధి దీపాలను కూడా ఏర్పాటు చేయాలని తండా వాసులు అడిగినట్లు పేర్కొన్నారు. వీటన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లి ఏ విధంగా మంచి చేయాలో ఆలోచిస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. అదే విధంగా కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు, యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ ఎరిక్షన్‌బాబు, ఎమ్మెల్యే అశోక్ రెడ్డితో పాటు పలువురు కూటమి నేతలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు విద్యాంజలి వరం





**కందుకూరు జనసాకి:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వనరులను సమకూర్చి తద్వారా విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడమే విద్యాంజలి ముఖ్య ఉద్దేశమని కందుకూరు డీవైఈఓ పి.పి నరసింహారావు అన్నారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాంజలి 2.0 కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎం టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈఓ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజల, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన వినూత్న పథకం విద్యాంజలి 2.0 కార్యక్రమని తెలిపారు. ఈ పథకం ద్వారా పాఠశాలలకు అవసరమైన వసతులను దాతల నుంచి సేవా కార్యక్రమాల రూపంలో ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి తోడ్పడుతుందన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రయాణాల పెంపునకు సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. దాతలు తమకు తోచిన రీతిలో పాఠశాలలకు సహకారం అందించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోర్టల్‌లో తమ పాఠశాలలోని సమస్యలు నమోదు చేయాలి. పాఠశాలలో భౌతిక వనరులు, భవన నిర్మాణం, ప్రహరీగోడ, విద్యుత్ సౌకర్యం, తరగతి గది అవసరాలు, డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, కో కరిక్యుల ర్ యాక్టివిటీస్, స్పోర్ట్స్ సామాగ్రి, ఆరోగ్య పరిరక్షణ కిట్లు, బోధన సామాగ్రి, కార్యాలయ అవసరాలు నెరవేర్చడం, పాఠశాల మరమ్మతులు, తదితర అవసరాలను తీర్చ వచ్చునని ఆయన సూచించారు. ఎంఈఓ ఎం. నాగకమారశర్మ మాట్లాడుతూ విద్యాంజలి 2.0 ప్రజల భాగస్వా మ్యంతో పాఠశాలల్లో మౌలిక వనరులను సమకూర్చడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్ధకంగా మారనుందని, పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి ఉపాద్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎం టీచర్లకు రిసోర్స్ పర్సన్లు ఎస్‌కె షౌకతుల్లా, ఏవి రావు, పివి. రమేష్‌శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఎం. నరసింహమూర్తి, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే





**కందుకూరు కావలి:** బోగోలు మండలం కొండ బిట్రగుంటలో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ మెట్లు, కళ్యాణమండపం తదితర పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న బ్రహ్మోత్సవాల లోపు పనులు అన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.